ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
సోమవారం 18 మార్చి 2024



టెన్త్ పరీక్షలకు రెడీ

నేటి నుంచి ప్రారంభం

- భూపాలపల్లి జిల్లాలో 20 పరీక్ష కేంద్రాలు.. 3,547 మంది విద్యార్థులు
- పకడ్బందీ నిర్వహణకు సర్వం సిద్ధం
- సీసీ కెమెరా నిఘాలో పటిష్ఠ చర్యలు
- సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు

భూపాలపల్లిటౌన్, మార్చి 17: పదో తరగతి పరీక్షలకు విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. సోమవారం నుంచి ఇవి ప్రారంభం కానుండగా వచ్చే నెల 2 వరకు కొనసాగనున్నాయి. పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టారు. జిల్లాలోని 117 పాఠశాలలకు చెందిన 3,547 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో 1,781 మంది బాలురు, 1,766 మంది బాలికలు ఉన్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించడానికి విద్యాశాఖ ఇప్పటికే రెండుసార్లు ఉద్యోగులకు శిక్షణ ఇచ్చింది. జిల్లాలో 20 కేంద్రాల్లో పరీక్షలు జరగనుండగా 20 మంది సూపరింటెండెంట్లు పర్యవేక్షించనున్నారు. ఇందులో మూడు సీ సెంటర్లు (పోలీస్‌స్టేషన్‌కు దూరంగా ఉన్న పరీక్ష కేంద్రాలు) ఉండగా మరో 17 బీ సెంటర్లను (పోలీస్ స్టేషన్‌కు అందుబాటులో ఉన్నవి) గుర్తించారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో కలిపి మొత్తం 20 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, ముగ్గురు కస్టోడియన్లు, 200 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వర్తించనున్నారు. రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్లు, రెండు రూట్ అధికారుల బృందాలు పనిచేయనున్నాయి.

సీ సెంటర్లు ఇవే..

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మూడు సీ సెంటర్లను విద్యాశాఖ అధికారులు గుర్తించారు. పోలీస్ స్టేషన్‌కు దూరంగా ఉన్న (3 కిలోమీటర్లకు పైగా) సెంటర్లు మల్హర్ మండలంలోని తాడిచర్ల జడ్పీహెచ్ఎస్, గణపురం మండలంలోని చెల్పూరు జడ్పీహెచ్ఎస్, మొగుళ్లపల్లి మండలంలోని మొట్లపల్లి జడ్పీహెచ్ఎస్ ఉన్నాయి. వీటి పర్యవేక్షణకు ప్రత్యేకంగా ముగ్గురు కస్టోడియన్లను నియమించారు.

ఈసారి ఏడు పేపర్లు

ఈసారి పదో తరగతి విద్యార్థులు ఏడు పేపర్లు రాయనున్నట్లు అధికారులు తెలిపారు. తెలుగు, హిందీ, ఆంగ్లం, సాంఘికశాస్త్రం, గణితంతో పాటు సామాన్యశాస్త్రం పరీక్షలు రెండు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, విద్యార్థులు అరగంట ముందే చేరుకోవాలని సూచించారు. సామాన్య శాస్త్రం పరీక్ష ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు మాత్రమే జరుగుతుందని తెలిపారు.

మౌలిక సౌకర్యాల కల్పన

పరీక్ష కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, వైద్య సేవలను అందుబాటులో ఉంచుతున్నట్లు డీఈవో రామ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మునిసిపాలిటీ, గ్రామ పంచాయతీ సహకారం తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి..
- రామ్‌కుమార్, డీఈవో భూపాలపల్లి

పదో తరగతి పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్ష కేంద్రాల్లో కావాల్సిన సిబ్బందిని, అధికారులను, స్క్వాడ్‌ను, ఇతర బృందాలను నియమించాం. మౌలిక సౌకర్యాలు కూడా సమకూర్చాం. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాం.



సీసీ కెమెరాల నిఘాలో...

పరీక్షలు జరుగుతున్న ప్రతి కేంద్రంలోనూ సీసీ కెమెరాలు పనిచేస్తాయని డీఈవో తెలిపారు. వీటిని ఆ యా కేంద్రాల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తారని పేర్కొన్నారు. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా పర్యవేక్షిస్తామని, ఎలాంటి అవకతవకలు లేకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

ఉచితంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం..

పరీక్షలు రాసే దూర ప్రాంత విద్యార్థులు సకాలంలో చేరుకోవడానికి అన్ని రూట్లలో బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. విద్యార్థులు తమ హాల్‌టిక్కెట్‌ను కండక్టర్‌కు చూపిస్తే చాలని పేర్కొన్నారు.



పరీక్షల సందర్భంగా బెంచీలపై హాల్‌టిక్కెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

ములుగు జిల్లాలో 21 పరీక్ష కేంద్రాలు

- హాజరు కానున్న 3, 088 మంది విద్యార్థులు
- 21 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లు
- 200 మంది ఇన్విజిలేటర్లు

8



ఆలయ శిల్పకళా సౌందర్యాన్ని వీక్షిస్తున్న అలోక్ ఆరాధే

రామప్ప శిల్పకళా సంపదకు చీఫ్ జస్టిస్ ఫిదా

- ఆలయాన్ని సందర్శించిన అలోక్ ఆరాధే

వెంకటాపూర్(రామప్ప), మార్చి 17: ములుగు జిల్లా వెంకటాపూర్(రామప్ప) మండలంలోని రామప్ప రామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే ఆదివారం సందర్శించారు. కుటుంబ సమేతంగా పర్యటించిన ఆయన పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయంలోకి ఆహ్వానించారు. రామలింగేశ్వర స్వామిని జస్టిస్ దంపతులతోపాటు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు నామవరపు రాజేశ్వర్‌రావు, లక్ష్మణ్, వినోద్, నర్సింగరావులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శిల్పకళా సౌందర్యాన్ని చూసిన జస్టిస్ మంత్ర ముగ్ధులయ్యారు. ఆలయ విశిష్టత గురించి అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ సూర్యకిరణ్‌తోపాటు గైడ్ ద్వారా తెలుసుకున్నారు. గర్భగుడి ఎదుట ఉన్న సప్తస్వరాలు పలికే పొన్నచెట్టు శిల్పాన్ని, నీటిలో తేలియాడే ఇటుకను చూసి అబ్బురపడ్డారు. ఆయన వెంట ములుగు జిల్లా జడ్జిలు పీవీపీ.లలిత శివజ్యోతి, మాధవి, రాంచందర్, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేణు గోపాలాచారి, ములుగు ఎస్పీ శబరీశ్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీఎస్పీ రవీందర్, తహసీల్దార్ సదానందం, డిప్యూటీ తహసీల్దార్ కిషోర్, ఎస్సై చల్ల రాజు, ఆలయ ఈవో బిల్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. చీఫ్ జస్టిస్ రామప్ప సందర్శన సందర్భంగా భక్తులు, పర్యాటకులను ఆలయంలోకి అనుమతించలేదు. దీంతో సుమారు రెండుగంటలపాటు వారు ఆలయ గార్డెన్‌లోనే నిరీక్షించాల్సి వచ్చింది.

గట్టమ వద్ద..

ములుగు కలెక్టరేట్ : ములుగు సమీపంలోని గట్టమ్మతల్లిని హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే దంపతులు దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆదివాసీ నాయకపోడ్ పూజారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్ ఆధ్వర్యంలో పూజారులు వారిని సన్మానించారు. గట్టమ్మతల్లి దేవాలయం విశిష్టత, ప్రత్యేకత గురించి జస్టిస్ అడిగి తెలుసుకున్నారు. ఆదివాసీ నాయకపోడ్ పూజారులకు, జాకారం గ్రామపంచాయతీకి చెందిన ప్రజలకు చోటుచేసుకున్న వివాదం గురించి పలువురు ఆయనకు క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పూజారులు కొత్త సదయ్య, లక్ష్మయ్య, ఆకుల మొగిలి, అరిగెల సమ్మయ్య, ఆకుల పుల్లయ్య, చిర్ర రాజేందర్, అరిగెల సంజీవ, ఆకుల రఘు, కొత్త రవి, రమేష్, సారయ్య, మొట్లపల్లి సరోజ, చిర్ర సుభద్ర, అరిగెల రఘు, మండపు నరేష్, అరిగెల పూర్ణచందర్, చిర్ర మహేందర్ పాల్గొన్నారు.

స్వాగతం పలికిన అధికారులు

హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే ములుగుకు రావడంతో కలెక్టర్ ఇలా త్రిపాఠితోపాటు ఎస్పీ శబరీశ్, అధికారులు స్వాగతం పలికారు. ఎస్పీ శబరీశ్ గట్టమ్మ దేవాలయం వద్ద చీఫ్ జస్టిస్‌కు మొక్కను అందజేశారు.

ఆలిండియా ఆదివాసీ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

గోవిందరావుపేట, మార్చి 17: ఆలిండియా ఆదివాసీ ఉద్యోగుల సంఘం ములుగు జిల్లా నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు కోటె రవి, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు నెహ్రూలాల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండలంలోని పస్రా గ్రామంలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా



ఆదివాసీ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

మిగతా 8వ పేజీలో..

ఆదివారం ఉష్ణోగ్రతలు

గరిష్టం : 36.0°C | కనిష్టం : 24.0°C

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సోమవారం	సా : 6.32 గం..
సహర్ :	మంగళవారం	ఉ : 5.00 గం..

జంపన్నవాగులో నీటమునిగి యువకుడి మృతి



రాజు మృతదేహం

మేడారం, ఫిబ్రవరి 17: ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలోని జంపన్నవాగులో నీట మునిగి యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని పోచమ్మబస్తీకి చెందిన రాసాని రాజు(22) సమ్మక్క, సారలమ్మల దర్శనానికి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఉదయం మేడారం వచ్చాడు. వనదేవతల దర్శనం అనంతరం జంపన్నవాగులో గుండ్ల మడుగు వద్ద ఈతకు వెళ్లాడు. లోతు ఎక్కువ ఉండటంతో అందులో మునిగి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చెరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. కానిస్టేబుల్స్ నీలకంఠేశ్వరన్, వెంకటేశ్వర్‌రావు, కన్నెపల్లి గ్రామానికి చెందిన గొంది నర్సింగరావు మూడు గంటలపాటు శ్రమించి రాజు మృతదేహం బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పోలీసులు ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి అవివాహితుడని, రియల్‌ఎస్టేట్ కార్యాలయంలో బాయ్‌గా పనిచేస్తున్నాడని తెలిపారు. మృతదేహాన్ని వెలికి తీసిన పోలీసు సిబ్బందిని, నర్సింగరావును సీఐ శంకర్ అభినందించారు. మృతుడి తండ్రి హనుమంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాషాయ గూటికి అరూరి

- బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే రమేష్
- హైదరాబాద్‌లో కిషన్‌రెడ్డి సమక్షంలో చేరిక
- బీజేపీ వరంగల్ లోక్ సభ అభ్యర్థిగా గ్రీన్‌సిగ్నల్?



అరూరి రమేష్‌కు బీజేపీ కండువా కప్పుతున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హనుమకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అరూరి రమేష్ బీజేపీలో చేరారు. ఆదివారం హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి సమక్షంలో ఆయన కాషాయ కండువా కప్పుకున్నారు. ఆయన బీజేపీలో చేరడంతో ఇన్నిరోజులు పార్టీ మార్పుపై కొనసాగిన హైడ్రామాకు తెరపడింది. అరూరి బీజేపీలో చేరికతో వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ ఖాయమని తేలింది. అరూరితో పాటు సుమారు 500 మంది కార్యకర్తలు కూడా బీజేపీలో చేరారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, జిల్లా నాయకులు గంటా రవికుమార్, నాయకులు డాక్టర్ కాళీప్రసాదరావు, సత్యపాల్‌రెడ్డి తదితరులు ఈ సందర్భంగా హాజరయ్యారు.

అయితే అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన అరూరి ఓడిపోయారు. ఆ తర్వాత వరంగల్ ఎంపీ స్థానంపై ఆశలు పెట్టుకున్నారు. పార్టీ టికెట్ ఇచ్చే విషయంలో అధిష్ఠానం సానుకూలంగా లేకపోవడంతో బీజేపీ వైపు మొగ్గుచూపారు. బీజేపీ అధినాయకత్వం కూడా ఆయన రాకను స్వాగతించారు. వరంగల్ లోక్‌సభ నుంచి పోటీకి సూత్ర ప్రాయంగా గ్రీన్‌సిగ్నల్ కూడా ఇచ్చింది. బీజేపీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్న అరూరి.. విలేకరుల సమావేశంలో ప్రకటించేందుకు సిద్ధమవుతుండగా అనూహ్యంగా బీఆర్ఎస్ నాయకులు ఆయన గృహానికి వచ్చి బీజేపీలో చేరవద్దని నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ససేమిరా అనడంతో ఆయనను బలవంతంగా కారులో ఎక్కించుకొని హైదరాబాద్‌కు తరలించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎదుట హాజరుపరిచారు. కేసీఆర్ సైతం బుజ్జగించే ప్రయత్నం చేశారు. వరంగల్ లోక్‌సభ నుంచి పోటీకి అవకాశం ఇస్తామని కూడా ఆశ చూపారు. పార్టీ కార్యాలయం నుంచి బయటకు రాగానే వరంగల్ లోక్‌సభ స్థానానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కడియం కావ్యకు టికెట్ ఇచ్చినట్లు ప్రకటించారు. దీనిని మరింత అవమానంగా భావించిన అరూరి.. బీజేపీలో చేరడానికి గట్టిగా నిర్ణయం తీసుకున్నారు.

వాస్తవానికి రెండు రోజుల కిందటే ఆయన బీజేపీలో చేరాల్సి ఉంది. కిషన్ రెడ్డితో కలిసి ఢిల్లీకి వెళ్లి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సమక్షంలో చేరేందుకు సిద్ధం కాగా, హైదరాబాద్‌లో ప్రధాని మోదీ రోడ్డుషో దృష్ట్యా వీలు పడలేదు. దీంతో ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కాషాయ కండువా కప్పుకున్నారు. ఎట్టకేలకు కొద్ది రోజులుగా అరూరి రమేష్ పార్టీ మార్పుపై కొనసాగుతున్న సస్పెన్షన్‌కు తెరపడింది. ఈ సందర్భంగా రమేష్ మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో అన్నివర్గాల అభివృద్ధితోపాటు 30 యేళ్ల పోరాటం తర్వాత మోదీ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ అందుబాటులోకి వస్తోందని, అందుకే తాను బీజేపీలో చేరానని తెలిపారు. మోదీ నాయకత్వంలో దేశ భద్రత పటిష్టంగా ఉంటుందన్నారు. పదేళ్లు ఆయన దేశాన్ని బ్రహ్మాండంగా పాలించాడన్నారు. అవినీతిరహిత పాలనంతో దేశం ముందుకు పోతోందని కితాబు ఇచ్చారు.

మేడారం గెస్ట్‌హౌస్‌లో సామగ్రి మాయం

మేడారం, మార్చి 17: సమ్మక్క, సారలమ్మ సన్నిధి మేడారంలోని ఐటీడీఏ క్యాంపు కార్యాలయ అతిథి గృహంలో పలు వస్తువులు అపహరణకు గురయ్యాయి. వీవీఐపీలు, వీఐపీలు, ప్రొటోకాల్ దర్శనాలు, పలువురికి భోజన, తాగునీరు తదితర సౌకర్యాల కోసం మహాజాతర సమయంలో రూ.5లక్షలతో కొనగోలు చేసిన సామగ్రి మాయమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. డైనింగ్ సెట్స్, రిఫ్రిజిరేటర్, కూలర్లు, మిక్సీలు, డిన్నర్ సెట్లు తదితర సామాన్లు కనిపించడం లేదు. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు జరిగిన మహాజాతరలో ముఖ్య అతిథులకు ఒక్కసారిగా 25 మందికి వసతి కల్పించేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో వీటిని అప్పుడు కొనుగోలు చేశారు. జాతర అనంతరం ఆ వస్తువులను భద్రపరచాల్సిన అధికారులే వాటిని మాయం చేశారని స్థానిక గిరిజనులు ఆరోపిస్తున్నారు. దీనిపై విచారణ చేపట్టాలని కోరుతున్నారు.

పదవులపై పెదవి విరుపు

కీలక నేతలకు, సీనియర్లకు దక్కని నామినేటెడ్ పోస్టులు

- మంత్రుల నియోజకవర్గాల్లోని నేతలకు ఝలక్
- వరంగల్ తూర్పు, ములుగు, భూపాలపల్లి నేతలకు నిల్
- ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాలోని నేతలకూ నిరాశే..
- ఇక జిల్లా స్థాయి పదవులపైనే ఆశలు





వరంగల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవుల పంపకం నేతల్లో అసంతృప్తి రగిలిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కీలకపాత్ర పోషించిన నేతలకు, సీనియర్లకు నామినేటెడ్‌లో గుర్తింపు దక్కలేదనే ఆవేదనలో ఉన్నారు. మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలతో పాటు ఎమ్మెల్యేలు లేని అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి కూడా ఎవరికి నామినేటెడ్ పదవులు ఇవ్వకపోవటంపై కాంగ్రెస్ నేతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. టికెట్ త్యాగం పేరుతో కొందరికే పదవుల ఇచ్చారని, మిగతా వారికి గుర్తింపేదని ఆందోళనలో కొందరు నేతలు ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 37 నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తే.. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి కేవలం ముగ్గురికి మాత్రమే పదవులు లభించటంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇన్నాళ్లు కాంగ్రెస్ జెండా మోసిన తమకు ఇంకెప్పుడు గుర్తింపని కాంగ్రెస్ నేతల్లో ఆవేదన వ్యక్తమవుతోంది.

ముగ్గురికే పదవులు

కాంగ్రెస్ ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది. పదేళ్ల తరువాత అధికారంలోకి రావటంతో చాలామంది సీనియర్ కాంగ్రెస్ నేతలు, గత ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్‌లను త్యాగం చేసిన నేతలు, ప్రొటోకాల్ పదవుల కోసం ఎదురుచూస్తున్న నేతలు అనేక మంది వీటిపై ఆశలు పెట్టుకున్నారు. అయితే గత శనివారం రాత్రి 37మందితో నామినేటెడ్ పదవులను ప్రభుత్వం ప్రకటించింది. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి రెండు డజన్లకుపైగా ఆశావాహులు ఉంటే.. కేలవం ముగ్గురికి మాత్రమే పదవులు దక్కాయి. దీంతో చాలామంది నేతల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. పరకాల టికెట్ ఆశించి భంగపడిన ఇనుగాల వెంకట్రామిరెడ్డికి కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కూడా) చైర్మన్ పదవి దక్కింది. వరంగల్ పశ్చిమ టికెట్ ఆశించిన జంగా రాఘవరెడ్డికి ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్, గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్‌గా పదవి దక్కింది. అలాగే మహబూబాబాద్ ఎంపీ టికెట్ ఆశించిన సీనియర్ నేత బెల్లయ్యనాయక్‌కు గిరిజన కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ట్రైకా) చైర్మన్ పదవి దక్కింది. అలాగే మాజీ ఎమ్మెల్యే పోదెం వీరయ్యకు అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పదవి, అయిత ప్రకాష్‌రెడ్డికి స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. అయితే పోదెం వీరయ్య ములుగు జిల్లా వాసి అయినప్పటికీ భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రికొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్నారు. దీంతో పోదెం వీరయ్య పోస్టు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఖాతాలోకి వెళుతుందని, అలాగే అయిత ప్రకాష్ రెడ్డి ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంథని నియోజకవర్గం పరిధిలోని మల్హర్ మండలంకు చెందిన నేత. భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్నప్పటికీ ఆయనకిచ్చిన పోస్టు

మిగతా 7వ పేజీలో..

గంజాయి మత్తులో యువత

- పొరుగు రాష్ట్రాల నుంచి నగరానికి పెద్దఎత్తున దిగుమతి
- ప్రముఖ విద్యా కేంద్రాల్లో గుట్టుగా విక్రయాలు
- కట్టడి చేయడంలో ఖాకీలు, ఎక్సైజ్ శాఖల నిర్లక్ష్యం

వరంగల్ క్రైం, మార్చి 17: వరంగల్ నగరంలో గంజాయి గుప్పుమంటోంది. పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్న గంజాయి ప్రముఖ విద్యా సంస్థలు కేంద్రంగా చేసుకుని విక్రయిస్తునట్లు తెలిసింది. గంజాయి సేవిస్తే ఆరోగ్యం పాడవుతుందని తెలిసి మరీ యువత ఈ మత్తుకు బానిసవుతున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ మత్తును యువత ఆస్వాదిస్తున్నారు. గంజాయికి బానిసలవుతున్నవారిలో సంపన్నుల పిల్లలు ఎక్కువగా ఉంటున్నారు. ఉన్నత విద్యాసంస్థల హాస్టల్స్‌లో ఉండే యువత ఎక్కువగా వినియోగిస్తున్నట్లు అధికారిక సమాచారం. యువతను టార్గెట్ చేసుకుని నగరంలో లక్షల్లో గంజాయి దందా సాగుతోంది. గంజాయి విక్రయాలను కట్టడి చేయడంలో ఖాకీలు వైఫల్యం చెందారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా పోలీసులు, ఎక్సైజ్ శాఖ అప్రమత్తం కాకుంటే వరంగల్ నగరం మరో పంజాబ్ అయ్యే ప్రమాదం ఉంది.

పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున దిగుమతి

పొరుగురాష్ట్రాలైన ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, రాజమండ్రి మీదుగా పెద్దఎత్తున గంజాయి వరంగల్ నగరానికి చేరుకుంటోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రోడ్డు మార్గాన రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్టమైన చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. దీనితో ఈదందా చేసే వారు రైలు మార్గాన్ని ఎంచుకున్నారు. ఒరిస్సా, విశాఖపట్నం నుంచి వచ్చే దళారులు రైలులో గుట్టు చప్పుడు కాకుండా లక్షల్లో గంజాయిని నగరానికి చేర్చుచున్నారు. ఈ వారంరోజుల్లోనే దాదాపు రెండువందల కిలోలకుపైగా గంజాయిని పట్టుకున్నట్లు తెలిసింది. నామమాత్రపు తనిఖీలతోనే ఈ మేరకు పట్టుకుంటే ఇంకా ఏ మేరకు రాష్ట్రానికి చేరుకుంటుందో ఊహించుకోవచ్చు. రాష్ట్రం చేరుకుంటున్న గంజాయి ఇక్కడి నుంచి తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ చేరుచున్నట్లు తెలిసింది.

కాగా గత సంవత్సరం (2023) వరంగల్ నగరంలో పోలీసులు పట్టుకున్న గంజాయి 417 కేజీలు కాగా, దీనివిలువ రూ.1కోటి 4లక్షల 42వేలు. ఈ యేడు మూడు మాసాల్లో పట్టుకున్న గంజాయి జనవరి 48.86 కేజీలు కాగా, దీని విలువ రూ.12లక్షల 22వేలు. ఫిబ్రవరి, మార్చి మాసాల్లో 17.5కేజీల గంజాయి పట్టుకోగా దీని విలువ రూ.4లక్షల 38వేలుంటుంది. ఈ లెక్కలు గమనిస్తే నగరంలో గంజాయి దందా ఏథేచ్ఛగా సాగుతున్నట్లు స్పష్టమవుతుంది.



పోలీసులు పట్టుకున్న గంజాయి (ఫైల్)

విద్యార్థులే లక్ష్యంగా..

వరంగల్ నగరంలోని యువత మత్తులో మునిగిపోతున్నారు. వందల కిలోల గంజాయి నగరానికి చేరుతుండటం గమనిస్తే యువత ఏ మేరకు దీనికి బానిసలయ్యారో తెలుస్తోంది. నగరానికి వస్తున్న గంజాయిని పొడి చేసి సిగరెట్లు, చాక్లెట్ల రూపేణా సరఫరా చేస్తున్నట్లు సమాచారం. కేజీ గంజాయి రూ.20వేల నుంచి రూ.30వేల వరకు ధర పలుకుతుందని తెలిసింది. దళారులు 10గ్రాములు, 20గ్రాముల చొప్పుల ప్యాకెట్స్ చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం. 10గ్రాముల ప్యాకెట్ రూ.100 నుంచి రూ.200 వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఒక సిగరెట్ గంజాయి దమ్ము లాగిస్తే ఆరు బీర్లు తాగినంత నిషా వస్తుందని వైద్యులు చెబుచున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ నిషాను యువత పొందుతున్నారు. ప్రముఖ విద్యా సంస్థల్లో విద్యనభ్యసించే యువత గంజాయి మత్తుకు బానిసలవుతున్నట్లు తెలిసింది. కరీంనగర్ రహదారి వెంట ఉన్న పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఈ దందా ఎక్కువగా సాగుతున్నట్లు తెలిసింది. రింగ్‌రోడ్డు పరిసరాల్లో విద్యార్థులు గంజాయిని సేవిస్తే పట్టుబడుతుండగా వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చి పంపుతున్నట్లు సమాచారం. ఇటీవల ఒక పోలీస్ స్టేషన్ పరిధిలో నలుగురు విద్యార్థులు గంజాయి సేవిస్తూ పట్టుబడినట్లు తెలిసింది. సంపన్నుల పిల్లలుగా గుర్తించి హెచ్చరించి పంపినట్లు తెలిసింది. ఇలా నగర కళాశాలల్లో ఈ దందా భారీగానే సాగుచున్నట్లు అధికారిక సమాచారం.

సోమనర్సయ్యకు డాక్టరేట్



కేయూ క్యాంపస్, మార్చి 17: కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం పరిశోధకుడు సముద్రాల సోమనర్సయ్యకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు ఆదివారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి తెలిపారు. 'అన్ అనాలసిస్ ఆన్ ఆంత్రోపోమెట్రిక్ మేనేజ్‌మెంట్ అండ్ ఫిజికల్ కాంపోనెంట్స్ ఎమాంగ్ జూనియర్ వాలీబాల్ ప్లేయర్స్ ఇన్ రిలేషన్ టు దెయిర్ పెర్ఫార్మెన్స్'అనే అంశంపై వరంగల్ కిట్స్ కళాశాల ప్రొఫెసర్ పీ. రమేశ్‌రెడ్డి పర్యవేక్షణలో సోమనర్సయ్య డాక్టరేట్ పూర్తి చేశారు. జనగామ జిల్లా జఫర్‌ఘడ్ మండలానికి చెందిన సోమనర్సయ్యను కేయూ ఎడ్యుకేషన్ విభాగం డీన్ ప్రొఫెసర్ ఎన్.రామనాథ్‌కిషన్, బీవోఎస్ చైర్మన్ ప్రొఫెసర్ రవికుమార్, కేయూ ఫిజికల్‌ఎడ్యుకేషన్ విభాగాధిపతి ఏటీబీటీ ప్రసాద్ అభినందించారు.

విచక్షణ కోల్పోకు..
విధిరాతను చెరపనీకు..



- పరీక్షల సమయాల్లో ఒత్తిడికి గురికావొద్దు
- ఇష్టపడి చదివితే అంతా సులభమే..
- విద్యార్థులూ.. ఆత్మన్యూనత భావాన్ని విడనాడాలి

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 17 : తీవ్రమైన పోటీ ప్రపంచంలో విద్యార్థులు మనోధైర్యాన్ని కోల్పోతూ మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. క్షణికావేశంలో బలవన్మరణాల పాలవుతున్నారు. పరీక్షల సమయాల్లో తీవ్ర మనోవేదనకు గురువుతున్న కొంతమంది విద్యార్థులు.. విచక్షణను కోల్పోతూ వారి తలరాతను వారే చెరిపేసుకుంటున్నారు. విద్యార్థులెప్పుడు ఇష్టపడి చదివితే సంక్లిష్టమైన సందర్భాలు కష్టపడకుండానే దాటేయవచ్చునని విద్యారంగ నిపుణులు, మనోవికాస నిపుణులు చెబుతున్నారు. మార్కులే పరమావధిగా కాకుండా విజ్ఞానం కోసం మాత్రమే చదువుతున్నామనే జిజ్ఞాసను విద్యార్థులు అలవర్చుకోవాలని వారు సూచిస్తున్నారు. విజయావకాశాలకు దారులు వెతుక్కుంటూ ముందుకు సాగాలని వారు సూచిస్తున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులపై అనవసరపు భారాలను మోపవద్దని వారు హెచ్చరిస్తున్నారు. సానుకూల దృక్పథంతో చుదువుకునే వాతావరణంలోకి విద్యార్థులను తీసుకొని రావాలని హితబోధ చేస్తున్నారు. ఇంటర్ విద్యార్థిని సాహిత్యమృతి, గతంలోనూ అనేక మంది విద్యార్థులు మార్కులు బాగా రాలేదని, పాస్ కాలేదని ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఉమ్మడి జిల్లాలో అనేకం ఉన్నాయి. ఇంటర్ పరీక్షలతో పాటు సీబీఎస్ఈ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. పదో తరగతి పరీక్షలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు మానసిక స్థైర్యాన్ని కోల్పోవద్దని 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

ఒత్తిడికి లోనుకావొద్దు.. మనోధైర్యాన్ని కోల్పోవద్దు..

విద్యార్థులెప్పుడు వారి సామర్థ్యాల మేరకు లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు చదువుకోవాలి. ప్రతికూల పరిస్థితుల్లోనూ సానుకూల దృక్పథంలో మందుకు సాగాలని విద్యారంగ నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థులు వారి లక్ష్యాలను ఎంచుకునే ముందుగానే అందుకు తగిన శ్రమ, ప్రయాసలను బేరీజు వేసుకొని అందుకు అనుగుణంగా వారి మానసిక పరిస్థితిని సిద్ధం చేసుకోవాలని వారు చెబుతున్నారు. పరీక్షలంటే విద్యార్థుల ప్రతిభా పాటవాలను ప్రదర్శించుకునే వేదికలుగా గుర్తించాలి. గెలుపోటములను సరిసమానంగా తీసుకునే మనోసిద్ధిని కలిగి ఉండాలని వారు సూచిస్తున్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను దరిచేరకపోతే ప్రత్యామ్నాయ లక్ష్యాల వైపు దూసుకెళ్లాలే తప్ప ప్రాణపరిహారం చేసుకోవద్దని నిపుణులు చెబుతున్నారు. ఏదైనా సందర్భంలో ఒత్తిడికి లోనైతే ఆ విషయాలను స్నేహితులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో పంచుకొని ఊరట చెందాలంటున్నారు.

భారాలను మోపొద్దు.. తీరాలకు చేర్చొద్దు..

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులపై తీవ్రమైన భారాన్ని మోపొద్దని మనోవికాస నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థుల సామర్థ్యాల మేరకు, వారికి ఇష్టమైన కోర్సుల్లో మాత్రమే చేర్చాలని చెబుతున్నారు. తల్లిదండ్రుల కోరికలను వారి పిల్లలపై రుద్దుతూ వారి మనోనిబ్బరాన్ని కోల్పోయేలా చేసే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పద్ధతులు మార్చుకోవాలని వారు హెచ్చరిస్తున్నారు. విద్యార్థుల మేథస్సును ఇతరులతో ఎప్పుడూ పోల్చవద్దని సూచిస్తున్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న మేథస్సును వెలికి తీస్తూ వారి ఇష్టాల మేరకు విద్యాబుద్ధులు చెప్పించాలే తప్ప తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిని ఇబ్బందులకు గురిచేయొద్దని చెబుతున్నారు. విద్యార్థులను విమర్శించకుండా వారిని సక్రమమైన దారుల్లో పెట్టేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలంటున్నారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా, ప్రేమ పూర్వకంగా మెలగుతూనే వారిలో లక్ష్యాలను చేరుకునే తృష్ణను రగించాలని సూచిస్తున్నారు. జీవితంలో విఫలమై విజయాలు సాధించిన వారి వివరాలను విద్యార్థులకు కథలుగా చెప్పాల్సిన ఆవశ్యకత ఉందంటున్నారు. విద్యార్థుల్లో ఉండే ఆత్మన్యూనత భావాలను తొలగించేందుకు నిష్ణాతులతో అవగాహన కల్పించాలని అభిప్రాయపడుతున్నారు.

సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలి

డాక్టర్ బరుపాటి గోపి, మనోవికాస నిపుణుడు



విద్యార్థులందరూ ప్రతికూల పరిస్థితుల్లోనూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలి. తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపాలి. ఎప్పటికప్పుడు వారి సామర్థ్యాలను అంచనా వేస్తూ సానుకూల వాతావరణంలో చదువుకునేలా వారిలో ఒత్తిడిని దూరంచేయాలి. మార్కులకు బదులుగా విద్యార్థులకు విజయావకాశాలకు దారులను చూపేందుకు కృషి చేయాలి.

దూరవిద్య డిగ్రీ పరీక్షల ఫీజు గడువు 4

కేయూ క్యాంపస్, మార్చి 17: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం అందిస్తున్న డిగ్రీ మొదటి, రెండో, మూడో ఏడాది బీఏ, బీకాం, జనరల్, కంప్యూటర్, బీబీఏ, బీఎస్సీ కోర్సుల్లో 2022-2023 వార్షిక పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు మళ్లీ పరీక్షల కోసం తమ ఫీజులను ఏప్రిల్ 4వ వరకు ఎలాంటి అపరాధరుసుం లేకుండా చెల్లించుకోవాలని కేయూ దూరవిద్యకేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, రెండో, మూడో ఏడాది పరీక్షలు రాసిన విద్యార్థులు ఫెయిలైన సబ్జెక్టులకు, అలాగే ఇంప్రూమెంట్ రాయాలనుకునే విద్యార్థులు తమ ఫీజులను చెల్లించుకోవాలని తెలిపారు. అన్ని పేపర్లకు రూ.600, రెండు పేపర్లకు రూ.500, ఇంప్రూవ్‌మెంట్ ఒక్కో పేపర్‌కు రూ.300 చెల్లించుకోవాలని పేర్కొన్నారు. ఫీజు చెల్లించిన చలనా, ఫొటో, ఫెయిలైనమెమో జతచేసి దూరవిద్యకేంద్రంలో అందచేయాలన్నారు.

పల్లెపాడు దామోదర్‌కు జాతీయ స్థాయి గుర్తింపు



డాక్టర్ పల్లెపాడు దామోదర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కాశోజీ జంక్షన్, మార్చి 17: వినియోగదారుల ఉద్యమంలో సామాజిక సేవ కార్యక్రమాలు 30ఏళ్ల పని చేస్తున్న డాక్టర్ పల్లెపాడు దామోదర్‌కు జాతీయస్థాయి గుర్తింపు లభించింది. 17వ తేదీన చెన్నైలో జరిగిన నేషనల్ కన్వెన్షన్‌లో చైర్మన్ అనంత్‌శర్మ చేతులమీదుగా మెడల్ అందుకున్నారు. డాక్టర్ పల్లెపాడు దామోదర్ మూడు దశాబ్దాలుగా వినియోగదారులను చైతన్యపరిచే కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా తూనికలు, కొలతలు జరిగే మోసాలపై, బంగారం కొనుగోలులో హాల్‌మార్క్, బీఐఎస్ ప్రాముఖ్యతపై, రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ యాక్ట్‌పై ప్రభుత్వ శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వినియోగదారులకు పటిష్టమైన రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం సవరణ చేసిన 2019 వినియోగదారుల చట్టం అమలు కోసం దక్షిణాది రాష్ట్రాలలో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కృషికి గాను జాతీయస్థాయి గుర్తింపు లభించింది. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రీతిపాండే, ప్రెసిడెంట్ అరుణ్ కుమార్, సీసీఐ జనరల్ సెక్రటరీ సాంబరాజు చక్రపాణి, సీసీఐ తెలంగాణ ప్రెసిడెంట్ ఎం.సుదర్శన్, వినియోగదారుల జాతీయ కన్వెన్షన్ సభ్యులు పాల్గొన్నారు.

రుద్రేశ్వరుడి సన్నిధిలో హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే



రుద్రేశ్వరాలయంలో జస్టిస్ అరాధేతోపాటు ఇతర న్యాయమూర్తులకు వేద ఆశీర్వచనం చేస్తున్న ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ

హనుమకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల గుడిని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే సతీసమేతంగా సందర్శించారు. రుద్రేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వర్తింపచేశారు. జస్టిస్ ఆరాధే వెంట హైకోర్టు జడ్జి జస్టిస్ టి.వినోద్‌కుమార్, జిల్లా పోర్టుఫోలియో జడ్జి, తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ జె.లక్ష్మణ్, హైకోర్టు జడ్జి జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు, హైకోర్టు రిజిస్ట్రార్ నర్సింగరావు, శ్రీనివాసరెడ్డి, వరంగల్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కోక రాధాదేవి, హనుమకొండ జిల్లా కోర్టు జడ్జి ఎం. క్రిష్ణమూర్తి వేయిస్తంభాల గుడికి విచ్చేశారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, వేదపండితుడు గంగు మణికంఠ శర్మ పూర్ణకుంభంతోస్వాగతం పలికారు. మంగళవాయిద్యాలతో ఆలయంలోకి తోడ్కొని వెళ్లారు. అనంతరం ఆలయ నాట్య మండపంలో తీర్థ ప్రసాదాలను, స్వామి వారి శేష వస్త్రాలను అందచేశారు. వేద ఆశీర్వచనం చేశారు.

వరంగల్ ఇంటాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావు ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించారు. ఆ తర్వాత పునరుద్ధరించి కల్యాణ మండపాన్ని తిలకించారు. జస్టిస్ ఆరాధే సందర్శకుల డైరీలో వేయిస్తంభాల గుడిని ఒక అద్భుతమైన కట్టడంగా అభివర్ణించారు. కాకతీయులు కళా రాధకులని, 800 యేళ్ల కిందట నిర్మించిన ఇలాంటి దేవాలయం ఈతరం వారు కూడా తరించడం గొప్ప అదృష్టమని, ఆలయాన్ని సందర్శించడం తనకు గొప్ప అనుభూతిని కలిగించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈవో వెంకటయ్య, అర్చకుడు ప్రణవ్, కేంద్ర పురావస్తు శాఖ కోఆర్డినేటర్ నిరంజన్ దేవాదాయ శాఖ సిబ్బంది ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 17: రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి డిమాండ్ చేశారు. హనుమకొండలోని సంఘ కార్యాలయంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా నాగిరెడ్డి మాట్లాడుతూ... ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న తరుణంలో పెండింగ్ బిల్లులను చెల్లించాలన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం డీఏలను మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. 10వ తరగతి పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు సరైన మౌలిక వసతులతో పాటు మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ సిబ్బందికి కనీస వసుతుల ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు. ఈనెల నుంచి ఉద్యోగ విరమణలున్నాయని, ఉద్యోగ విరమణ పొందిన వారికి రావాల్సిన గ్రాట్యుటీ, కమ్యూటేషన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర బెనిఫిట్లను సత్వరమే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి రావుల రమేష్, హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ముత్యాల రఘుపతి, గొడిశాల సత్యనారాయణ, నాయకులు బిల్ల సుబ్బారావు, రమేష్, లక్ష్మయ్య, కుమారస్వామి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి స్త్రీవాద రచయిత చలమే..

- అన్నిట్లో స్త్రీ, పురుషులు సమానమన్న అభిప్రాయం కలగాలి
- డాక్టర్ అంపశయ్య నవీన్.. ఐదు గ్రంథాల ఆవిష్కరణ
- ఘనంగా రుద్రమ ప్రచురణల దశాబ్ది వేడుకలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ అంపశయ్య నవీన్

హనుమకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సాహిత్యంలో మొదటి స్త్రీవాద రచయిత చలమేనని, అన్ని విషయాలలో స్త్రీలు, పురుషులు సమానమన్న అభిప్రాయం కలగాలని ప్రముఖ నవలా రచయి త డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. రుద్రమ ప్రచురణల దశమ వార్షిక సమావేశాలలో భాగంగా ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠ శాలలో ఓరుగల్లు రచయిత్రుల ఐదు గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈఐదు గ్రంథాల ఆవిష్కరణలను ఐదు సమావేశాలుగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనిశెట్టి రజిత, కొమ్రాజు రామలక్ష్మి నిర్వాహకులుగా వ్యవహరించారు. మొదటి సమావేశంలో చిమమండ న్గోజి అడిచే గ్రంథాన్ని డాక్టర్ అంపశయ్య నవీన్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరూ ఇలాంటి పుస్తకాలు చదివితే స్త్రీల విషయంలో అభిప్రాయాలు మారుతాయని అన్నారు. పుస్తకాన్ని మెట్టు రవీందర్ పరిచయం చేశారు. రెండో సమావేశంలో తమ్మెర రాధిక హవేలీ దొరసాని కథా సంపుటిని బీవీఎన్ స్వామి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. రాధిక కథలో ప్రత్యేకత కనిపిస్తుందని, విభిన్న వస్తువులతో వాస్తవిక దృక్పథం ఉంటుందని అన్నారు. పుస్తకాన్ని మాలతీలత పరిచయం చేశారు. మూడో సమావేశంలో భార త దేశంలో వితంతు వ్యవస్థ అనే గ్రంథాన్ని ఆవిష్కరించిన తిరునగరి దేవకీదేవి దేశంలోని వితంతు దుర్భర పరిస్థితులను వివరించారు. తెన్నేటి విజయచంద్ర పుస్తకాన్ని పరిచయం చేశారు. నాలుగో సమావేశంలో తమ్మెర రాధిక మరొక గ్రంథం కాలం జాడలు తీస్తూ.. కవితా సంపుటిని ఆవిష్కరించిన పొట్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాధిక కవిత్వంలో మానవ సంబంధాల ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. పుస్తకాన్ని చంద్రకళ పరిచయం చేశారు. ఐదో సమావేశంలో అని శెట్టి రజిత కాలం కాన్వాస్ మీద కతా సంపుటిని ఆవిష్కరించిన వీఆర్ విద్యార్థి మాట్లాడుతూ.. అనిశెట్టి రజిత కాన్వాస్ పెద్దదని, ఆమె కవిత్వంలో వస్తు వైవిధ్యం తాత్వికత ఉంటుందన్నారు. ఈపుస్తకాన్ని సింగరాజు రమాదేవి పరిచయం చేశారు.

ఈ సమావేశంలో నాగిల్ల రామశాస్త్రి, డి.ధర్మయ్య, నిధి, పల్లె శ్రీను, బి.రమాదేవి, వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, పల్లేరువీరాస్వామి, బిల్ల మహేందర్, నేరేళ్ల శ్రీనివాస్ సౌహార్ద్ర సమన్వయకర్తలుగా వ్యవహరించారు. కొమర్రాజు రామలక్ష్మి ముగింపు వ్యాఖ్యాలు పలికిన ఈ సమావేశాలలో కవులు, రచయితలు, సాహితీ వేత్తలు, కళాకారులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గొర్రెలకాపరిని కాటేసిన పాము

- పామును సంచిలో వేసుకుని ఆస్పత్రులకు పరుగులు
- అది ఏ పామో తెలియక చికిత్స చేయని వైద్యులు



సంచిలో పామును వేసుకుని ఎంజీఎం ఆస్పత్రికి వచ్చిన రాజెల్లు

వర్ధన్నపేట రూరల్, మార్చి 17 : పాము కాటుకు గురైన గొర్ల కాపరి కాటేసిన పామును తీసుకుని వైద్యం కోసం ఆస్పత్రుల చుట్టూ తిరగ్గా, అది ఏ పామె తెలియక వైద్యం చేయని ఉదంతం వరంగల్ జిల్లాలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుడు నక్క రాజెల్లు కథనం ప్రకారం... వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని బండౌతపురం గ్రామానికి చెందిన గొర్ల కాపరి నక్క రాజెల్లు రోజులాగే చెరువులో గొర్లను కాస్తున్నాడు. ఎంత ఎక్కువగా ఉండడంతో ఓ చెట్టు కింద సేద పడుకున్నాడు. చెట్టుపై నుంచి గుర్తు తెలియని పాము కింద పడింది. పామును గమనించిన ఓ గొర్రె దానిపై దాడి చేయడంలో పాము గొర్లకాపరి చేతిపై కాటు వేసింది. దీంతో అతడు పామును చంపి, దానిని ఓ సంచిలో వేసుకుని కుటుంబ సభ్యులతో కలిసి వైద్యం కోసం వర్ధన్నపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాడు. వైద్యులు ఓ ఇంజక్షన్ వేసి గ్లూకోజ్ పెట్టి, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. అక్కడి నుంచి పామును తీసుకుని ఎంజీఎం ఆస్పత్రికి చేరుకున్నాడు. పామును గమనించిన వైద్యులు అది రక్తపింజర, కొండచిలువ అనేది తేల్చలేకపోతున్నామని, సరైన వైద్యం చేయలేమని వైద్యులు తేల్చారు. ఏం చేయాలో తెలియక, బంధువుల సూచన మేరకు రాయపర్తి మండలంలోని కొండాపురం గ్రామానికి వెళ్లి నాటు వైద్యం చేసుకున్నాడు. అనంతరం ఇంటికి చేరుకున్నాడు. కాటు వేసిన చోటచేయి వాపు వచ్చింది. ప్రస్తుతం రాజెల్లు ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆకట్టుకున్న బ్రైడల్ ఫ్యాషన్ షో

- విదేశీయులను ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



బ్రైడల్ ఫ్యాషన్ షోలో భారతీయ మహిళలు

హనుమకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి):అమెరికా కెంటకీలోని లూయిస్ విల్లేలో శనివారం రాత్రి స్పీడ్ ఆర్ట్ మ్యూజియం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రవాస భారతీయుల సాంస్కృతిక ప్రదర్శనలు విదేశీయులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సాన్ డీగో మ్యూజియం ఆఫ్ ఆర్ట్ సేకరించిన భారత్‌తో సహా దక్షిణాసియా దేశాలకు చెందిన అత్యంత ప్రాచీనమైన చిత్ర కళాఖండాల గురించి ఆమెరికాలోని చిత్ర కళాభి మానులకు, మ్యూజియం సందర్శకులకు అవగాహన కలిగించడానికి చేపట్టిన ప్రచార కార్యక్రమంలో భాగంగా స్పీడ్ ఆర్ట్ మ్యూజియం హాల్‌లో లూయిస్‌విల్లేలోని ప్రవాస భారతీయులతో ఈ సాంస్కృతిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో 50 మందికిపైగా ప్రవాస భారతీయులు వారి కుటుంబసభ్యులు పాల్గొని సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. ప్రధానంగా ప్రవాస భారతీయ మహిళల వధువుల వేషధారణ (బ్రైడల్ షో) విశేషంగా ఆకట్టుకున్నది. భారత దేశంలోని ఆయా రాష్ట్రాల్లో వివాహాల సందర్భంగా ఆ రాష్ట్రాల సంప్రదాయాల ప్రకారం వధువులను అలంకరించే తీరు, వారి వస్త్రధారణ, నగల గురించి తెలియ చేసేఈ ప్రదర్శన ఆద్యంతం విదేశీయులను విశేషంగా ఆకట్టుకున్నది. ఒక్కో రాష్ట్రం నుంచి ఒక్కో వధువు ఆ రాష్ట్రం సంస్కృతి, సంప్రదాయం ప్రతిబింబించేలా అందంగా అలంకరించుకొని వేదికపై నిర్వహించిన క్యాట్ వాక్, మేడ్ ఇన్ ఇండియా పాట నేపథ్యంగా ఇచ్చిన ఈ ప్రదర్శన అబ్బురపరిచింది. అనంతరం సమర్పణ్ నృత్య పాఠశాల ప్రవాస భారతీయ పిల్లలు నిర్వహించిన నృత్య ప్రదర్శన కూడా విశేషంగా ఆకట్టుకున్నది. బ్రైడల్ షోకు లక్ష్మి, దీప్తి కొరియోగ్రాఫర్లుగా వ్యవహరించారు.

పదవులపై పెదవి విరుపు

(5వ పేజీ తరువాయి)

ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోటాలోకి వెళుతుందని అంటున్నారు.

సీనియర్లు, కీలక నేతలకు ఝలక్

కాంగ్రెస్ పార్టీలో సీనియర్లు, ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించిన నేతలకు నామినేటెడ్ పోస్టుల్లో అన్యాయం జరిగిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పాలకుర్తి కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి నామినేటెడ్ పోస్టుపై ఆశలు పెట్టుకున్నారు. అలాగే సీనియర్ నేత బొద్దిరెడ్డి ప్రకార్ రెడ్డి. మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, గత ఎన్నికల్లో వర్ధన్నపేట సీటును త్యాగం చేసిన నమిండ్ల శ్రీనివాస్‌తో అనేక మంది సీనియర్లకు నామినేటెడ్ పదవులు వరించకపోవటంపై కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. మరో మహిళ నేత కె.రవళిరెడ్డికి కూడా కీలకమైన పోస్టు దక్కుతుందని భావించినప్పటికీ నిరాశే మిగిలింది. అలాగే భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాలకు చెందిన మాజీ మావోయిస్టు నేత గాజర్ల అశోక్‌కు కూడా నామినేటెడ్ పోస్టు దక్కకపోవడం ఆయన వర్గీయుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అలాగే మంత్రి కొండా సురేఖ ప్రాతినిథ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి నామినేటెడ్ పదవి ఒక్కరికి కూడా దక్కలేదు. మీసాల ప్రకాష్, నల్లొండ రమేష్, గోపాల నవీన్‌రాజ్ తదితర నేతలు నామినేటెడ్ పోస్టులు వస్తాయనే ఆశతో ఉన్నారు. అలాగే మరో మంత్రి సీతక్క ప్రాతినిథ్యం వహిస్తున్న ములుగు నుంచి కూడా ఒక్కరికి నామినేటెడ్ పోస్టులు దక్కలేదు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, గొల్లపల్లి రాజేందర్ తదితర నేతలకు నామినేటెడ్ పదవులు వరిస్తాయని క్యాడర్ భావించినప్పటికీ నిరాశే మిగిలింది. నర్సంపేట, డోర్నకల్, భూపాలపల్లి నియోకవర్గాల నుంచి కూడా ఎవరికి నామినేటెడ్ పదవులు దక్కకపోవటంతో కేడర్‌లో కొంత అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ఎమ్మెల్యేలు లేని చోట కూడా..

అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ, స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌పార్టీ ఓడిపోయింది. ప్రభుత్వ కార్యక్రమాల్లో పార్టీ ప్రతినిధులు లేకుండా పోవటంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆందోళన చెందుతున్నారు. దీంతో జనగామ నుంచి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, స్టేషన్‌ఘనపూర్ నుంచి శనిగపురం ఇందిరకు నామినేటెడ్ పోస్టులు దక్కుతాయని ఆశించారు. అయితే వీరికి గానీ, వారి అనుచరులకు కానీ నామినేటెడ్ పదవులు దక్కకపోవటంపై నేతలు నారాజ్ అవుతున్నారు. వరంగల్ ఎంపీ టికెట్ కోసం ఇందిర తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ కోణంలో ఇందిరకు ఇవ్వకపోయినప్పటికీ ఇదే నియోజకవర్గానికి చెందిన మరో నేతకు నామినేటెడ్ పోస్టు ఇస్తే ప్రొటోకాల్ ప్రకారం అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఇక జిల్లాస్థాయి పదవులే..

రాష్ట్రస్థాయిలో కీలక నామినేటెడ్ పోస్టులు దాదాపు పూర్తి చేశారు. మిగిలిన కొన్ని పోస్టులకు రాష్ట్రస్థాయిలో పోటీ తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో ఇక జిల్లాస్థాయి నామినేటెడ్ పోస్టులపైన నేతలు ఆశలు పెట్టుకుంటున్నారు. మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీలు, గ్రంథాలయ చైర్మన్‌లాంటి పదవులపై కాంగ్రెస్ నేతలు దృష్టి సారించాల్సి ఉంది. వీటితో పాటు కార్పొరేషన్‌లకు రాష్ట్ర స్థాయి డైరెక్టర్ పదవులు కూడా ఉండటంతో వాటిలో ఏదో ఒకటి రాకపోతుందా? అనే ఆశతో కాంగ్రెస్ నేతలు ఉన్నారు. పదేళ్లుగా అధికారానికి దూరంగా ఉంటూ పార్టీని కాపాడుకుంటూ వస్తున్నవారికి నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నారు.

పదో తరగతి పరీక్షలకు
సర్వం సిద్ధం

ములుగు జిల్లాలో 21 సెంటర్లు

హాజరుకానున్న 3,088 మంది విద్యార్థులు

ములుగు కలెక్టరేట్, మార్చి 17: పదోతరగతి వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధమైంది. సోమవారం నుంచి ఏప్రిల్ 2 వరకు పరీక్షలు జరుగనున్నాయి. ఇందు కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. పరీక్షలు జరుగుతున్న సమయంలో కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండనుంది.

జిల్లా వ్యాప్తంగా 21 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 3,088 మంది విద్యార్థులు ఉండగా వారు పరీక్షలు రాసేందుకు సౌకర్యాలు కల్పించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరుగనుంది. 21 కేంద్రాలకు 21మంది చీఫ్ సూపరింటెండెంట్లు, అంతేమంది డిపార్టుమెంట్ ఆఫీసర్లను నియమించారు. 200 మంది ఇన్విజిలేషన్ సిబ్బంది పని చేయనున్నారు. పరీక్షల పరిశీలన కోసం రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియమించారు. జిల్లాను రెండురూట్లుగా విభజించి పలువురు ఆఫీసర్లను నియమించారు.

పరీక్షలపై నిఘా..

పరీక్షలను పకడ్బందీగా జరిపించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ప్రతి పరీక్ష కేంద్రానికీ ఒక సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు. స్థానిక పోలీసుల తోపాటు స్పెషల్ పార్టీ సిబ్బంది భద్రత ఏర్పాట్లను పర్యవేక్షిం చనున్నారు. నిమిషం నిబంధన సడలించబడగా ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను కేంద్రంలోకి అనుమ తించనున్నారు. అయితే ఎలక్ట్రానిక్ పరికరాల విషయంలో కఠినంగా వ్యవహరించనున్నారు. విద్యార్థులతోపాటు ఇన్విజిలేషన్ సిబ్బంది కూడా ఎటు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకుండా ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని డీఈవో పాణిని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు హాజరుకావాలని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా సౌకర్యాలను కల్పించామని వెల్లడించారు.

144 సెక్షన్ విధించాం: ఎస్పీ శబరీశ్

పదోతరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో జిల్లాలోని పరీక్ష కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లను చేశామని ఎస్పీ శబరీశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను విధించామని పేర్కొన్నారు. జిల్లాలోని 21 పరీక్ష కేంద్రాల్లో 3088 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా పోలీస్ అధికారులు, 250 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారని వివరించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని పేర్కొన్నారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల చుట్టుపక్కల ఉన్న జిరాక్స్‌షాపులను మూసివేయాలని నిర్వాహకులకు సూచించారు. పరీక్ష కేంద్రాల చుట్టూ గుంపులుగా కనిపిస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు.

మేడారంలో భక్తుల సందడి



సమ్మక్క గద్దెను దర్శించుకుంటున్న భక్తులు



వనదేవతల గద్దెలకు తరలివస్తున్న భక్తులు

మేడారం, మార్చి 17 : తాడ్వాయి మండలం మేడారంలో ఆదివారం సందడి నెలకొంది. వారాంత సెలవు కావడంతో వివిధ ప్రాంతాల భక్తజనం భారీ సంఖ్యలో తరలివచ్చారు. సమ్మక్క, సారలమ్మల గద్దెలకు పూలు, పండ్లు, పసుపు. కుంకుమ చీరె సారె, కొబ్బరికాయలు బెల్లం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చల్లగా చూడాలని అమ్మవార్లను కోరుకున్నారు. 10 వేలకు పైగా భక్తులు వనదేవతల గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

మెపా జిల్లా కార్యవర్గం ఎన్నిక

భూపాలపల్లిటౌన్, మార్చి 17: ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఇన్ తెలంగాణ (మెపా) జయశంకర్ భూపాలపల్లి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్‌ముదిరాజ్ ఆదివారం ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల సుభాష్ అధ్యక్షతన ఈ ఎన్నిక జరిగిందని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా గొడుగు సాహిత్, ప్రధాన కార్యదర్శిగా మండ రవీందర్, ఉపాధ్యక్షుడిగా పిట్టల లింగయ్యను ఎన్నుకున్నారు. యూత్ అధ్యక్షుడిగా జోరు రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పిట్టల సాయికుమార్, ఉపాధ్యక్షుడిగా చందు, సంతోష్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు, నాయకులు సాయిశివ, రఘుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వారిని ఆదుకోవాలి : సీపీఐ

కాకతీయఖని, మార్చి 17: భూపాలపల్లి జిల్లా మల్లంపల్లి క్రాస్ వద్ద ఇటీవల జరిగిన బస్సు, డీసీఎం ప్రమాదంలో గాయపడిన వారిని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి సొత్కు ప్రవీణ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారని, వారికి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్సను అందిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ భవేష్ మిశ్రా చొరవ చూపి వారికి కార్పొరేట్ ఆస్పత్రిలో మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

రైతు వేదికల నిర్వహణ ప్రశ్నార్థకం

నిధులు రాక నిర్వహణకు తప్పని తిప్పలు ● ఏడాదిగా డబ్బుల్లేక ఇబ్బందులు పడుతున్న ఏఈవోలు

మొగుళ్లపల్లి, మార్చి 17: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని రైతువేదికల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. నెలనెలా వచ్చే నిధులు ఏడాది పైగా రాకపోవడంతో వాటి నిర్వహణ సరిగా సాగడం లేదు. డబ్బుల్లేక వ్యవసాయ విస్తరణాధికారులకు పెనుభారంగా మారింది. కనీసం విద్యుత్‌చార్జీలు కూడా చెల్లించే పరిస్థితి కనిపించడంలేదు. రైతులు నిరంతరం సమావేశాలు నిర్వహించుకుని పంటల సాగు, కొత్త విధానాలతోపాటు అధికారుల సూచనలు, సలహాలు తెలుసుకునేందుకు వీలుగా జిఆల్లలో రైతు వేదికలను గత ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. వ్యవసాయ కస్టర్ల వారీగా 55 రైతు వేదికలను నిర్మించింది. వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులకు అందుబాటులో ఉండేలా రైతు వేదికల్లో వసతులు కల్పించారు. ప్రత్యేకంగా ఫర్నిచర్ ఏర్పాటు చేశారు. శిక్షణ కార్యక్రమాలకు అవసరమైన కుర్చీలు, మైక్‌సెట్‌ల వంటివి కూడా అందుబాటులో ఉంచారు. ప్రభుత్వ నిధులతోపాటు రైతుల తోడ్పాటుతో కొన్నిచోట్ల అవసరమైన సౌకర్యాలను సమకూర్చుకున్నారు. వీటిలో సీజన్ వారీగా పంటల సాగుపై రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైతువేదికల్లో అధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. వీటిని ఇతర శాఖలు కూడా వినియోగించుకుంటున్నాయి. రైతు వేదికలు కొన్ని గ్రామాలకు దగ్గరగా ఉండగా, మరికొన్నింటిని దూరంగా నిర్మించారు. వీటిలోనే క్లస్టర్ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఒక్కో రైతువేదికను రూ.22 లక్షలతో నిర్మించారు. వాటి నిర్వహణకు మొదట నిధులు కేటాయించారు. రైతు వేదికలను నిత్యం శుభ్రం చేసేందుకు, విద్యుత్‌చార్జీలు, తాగునీటి కోసం, స్టేషనరీ, మరమ్మతుల కోసం నెలకు రూ.9,500 కేటాయించింది. రైతు వేదికల నిర్వహణకు ప్రభుత్వం తగిన నిధులు విడుదల చేయకపోవడంతో ఏఈవోలు ఇబ్బందులు పడుతున్నారు. 2022 ఆగస్టు వరకు ప్రతినెలా రూ.9,500 చొప్పున నిధులు కేటాయించింది. సెప్టెంబరు నుంచి ఇప్పటి వరకు డబ్బులు రాకపోవడంతో ఏఈవోలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఒక్కో రైతువేదికలో విద్యుత్‌చార్జీలు ప్రతినెలా చెల్లించకపోవడంతో వేలల్లో బకాయిలుగా మిగిలిపోయాయి. డబ్బులు విడుదల చేయాలని గత ప్రభుత్వానికి కూడా విన్నవించినప్పటికీ నిధులు విడుదల చేయలేదు.

కొత్త ప్రభుత్వం.. 'రైతునేస్తం'

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతునేస్తం అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. అందులో భాగంగానే రానున్న సీజన్‌లో రైతువేదికల్లో రైతులకు వివిధరకాల పంటల సాగుపై శాస్త్రజ్ఞులతో రైతులకు శిక్షణ తరగతులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుంది. ఒకప్పుడు ఏఈవోలు గ్రామాలకు వచ్చినప్పుడు గ్రామపంచాయతీ కార్యాలయాలను వినియోగించుకునేవారు. రైతులకు ఒక క్లస్టర్‌గా ఏర్పాటుచేసి రైతువేదికలు నిర్మించడం వల్ల వాటిని వ్యవసాయ క్లస్టర్ కార్యాలయాలుగా వినియోగించుకుంటున్నారు. ఈవేదికల వల్ల ఏఈవోలు రైతులకు అందుబాటులో ఉంటున్నారు. వాటి నిర్వహణకు సంబంధించి నెలనెలా ఇవ్వాల్సిన డబ్బులు అందకపోవడంతో శుభ్రం చేయడం, తాగునీటి కోసం ప్రస్తుత ఏఈవోలు సొంతంగా సర్దుబాటు చేస్తున్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి రైతు వేదికల నిర్వహణకు డబ్బులు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



రైతువేదికల నిర్వహణకు ప్రభుత్వం నుంచి ఏడాదికిపైగా డబ్బులు రావడంలేదు. దీంతో ఏఈవోలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం వాస్తవమే. రైతువేదికల నిర్వహణ డబ్బులు రాకపోవడం విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- విజయభాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి

ఆలిండియా ఆదివాసీ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

(5వ పేజీ తరువాయి)

మంకిడి రవి, ప్రధాన కార్యదర్శిగా సోలం వెంకటేశ్వర్లు, ట్రెజరర్‌గా అల్లం భాస్కర్, ఉపాధ్యక్షులుగా మైపతి సంతోష్, కుంజ శ్రీను, జాయింట్ సెక్రటరీగా ఈక లక్ష్మీనారాయణ, గౌరవ సలహాదారులుగా అన్నెబోయిన కేశవరావు, రేగ నరేంద్రకుమార్, సభ్యులుగా పెందగట్ల ప్రశాం త్, పి.ప్రసాద్, సనప రవి, వంగ పాపయ్యలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, సురేందర్‌రావు, ప్రభాకర్, నాగేశ్వర్‌రావు, ఎర్రయ్య, వినోద్‌కుమార్, ఎల్లయ్య దొర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), మార్చి 17: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని జంగేడుకు చెందిన ఏమకొండ సాంబయ్య ద్విచక్ర వాహనంపై అంబేద్కర్ కూడలి నుంచి సుభాష్‌కాలనీ వైపు వెళ్తుండగా లారీ ఢీకొంది. దీంతో అతడు వెనక టైర్ల కింద పడ్డాడు. లారీ టైర్లు ఎక్కడంతో సాంబయ్య రెండు కాళ్లకు నుజ్జునుజ్జు అయ్యాయి. వెంటనే పోలీసులు, స్థానికులు 108 సహాయంతో అతడిని ఆస్పత్రికి తరలిం చారు. గాయాలపాలైన వ్యక్తి కుమారుడు భరత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేష్‌కుమార్ వెల్లడించారు.

కారు, బైక్ ఢీకొని..

కాటారం : కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొని ఒకరు గాయపడిన సంఘటన మండలంలోని గంగారం సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. గంగారం క్రాస్ రోడ్డు నుంచి విలాసాగర్ వైపు కారు వెళ్తుండగా అదే సమయంలో తిరుపతిరెడ్డి బైకు ఎదురైంది. రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో తిరుపతిరెడ్డికి గాయాలయ్యాయి. దీంతో అతడిని ఆస్పత్రికి తరలించారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని..

గణపురం : ఎదురెదుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలోని గణపసముద్రం మత్తడి వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పరకాల మండలం రంగాపురం గ్రామానికి చెందిన ఎంజపెల్లి రవి తన వ్యక్తిగత పని నిమిత్తం గణపురం వస్తుండగా ములుగు జిల్లా వెంకటాపురం మండలం వెల్తుర్లపల్లి గ్రామానికి చెందిన బీరెల్లి రాజు గాంధీనగర్ వైపు వెళుతున్నాడు. ఈ క్రమంలో గణపసముద్రం వద్ద ఎదురెదుగా ఢీకొనడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్సు ద్వారా వీరిని ములుగు సివిల్ ఆస్పత్రికి తరలించారు.

మంత్రి శ్రీధర్‌బాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

కాటారం, మార్చి 17: పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఫ్లెక్సీకి కాంగ్రెస్ నాయకులు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. తెలంగాణ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొ రేషన్ చైర్మన్‌గా డీసీసీ అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డిని నియ మించడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీటీసీ మహేశ్వరి, డీసీసీ ఉపాధ్యక్షుడు గద్దె సమ్మిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు తెప్పల దేవేందర్‌రెడ్డి వంశవర్ధన్ రావు, తెప్పల ప్రభాకర్, కొట్టె శ్రీహరి, కామిడి వెంకట్‌రెడ్డి, గంగిరెడ్డి లచ్చిరెడ్డి, చీమల రాజు, వెంకటస్వామి, పసుల మొగిళి, కొట్టె ప్రభాకర్, కామిడి శ్రీనివాస్, కుమార్, నారాయణ, శశి, చీర్ల సమ్మిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రమేష్, నరేందర్, శివారెడ్డి పాల్గొన్నారు.

తప్పిపోయిన వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగింత



వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

మహదేవపూర్, మార్చి 17: మతిస్థిమితం లేని వృద్ధుడు తప్పిపోగా అతడి ఆచూకీని కాళేశ్వరం పోలీసులు 24 గంటల్లోనే కనుగొన్నారు. అనంతరం అతడిని కుటుంబ సభ్యులకు అప్ప గించారు. కాళేశ్వరం ఎస్సై భవానీసేన్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా నర్సిం హులపేటకు చెందిన కార్ల వెంకన్న (72) కళేశ్వరానికి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం వచ్చాడు. ఈ క్రమంలో అతడు తప్పిపోయాడు. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా పోలీసులు ఆదివారం అతడి ఆచూకీ కనుగొని కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో కుటుంబ సభ్యులు కాళేశ్వరం పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

అంబేద్కరిస్టులను సత్కరిస్తాం

● ఆల్ ఎంప్లాయిస్ అండ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు శంకర్

భూపాలపల్లి టౌన్, మార్చి 17: నిజమైన అంబేద్కరిస్టులకు సత్కారిస్తామని ఆల్ ఎంప్లాయిస్ అండ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు లింగమల్ల శంకర్ అన్నారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని నిజమైన అంబేద్కరిస్టులకు, పూలే వాదులను గుర్తించి ఘనంగా సత్కరించడమే కాకుండా సర్టిఫికేట్, బంగారు పతకాలను బహూకరిస్తామని అన్నారు. కొన్నేళ్లుగా కొనసాగుతున్న ఉద్యమంలో కేవలం వర్థంతి, జయంతి వేడుకలు మాత్రమే జరుపుకుంటున్నారని, ఇక మీదట అంబేద్కర్, పూలే ఆశయ సాధన కోసం అహర్నిశలు పనిచేస్తున్న వారిని గుర్తించి సత్కరిస్తామని అన్నారు. ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని అంబేద్కరిస్టులు, ఉద్యోగులు, విద్యార్థులు, మేధావులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కాళేశ్వరం జోనల్ అధ్యక్షుడు చింతల కుమార్, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఓనపాకల రాజయ్య, నాయకులు పీక కిరణ్, లింగమల్ల వెంకటస్వామి, రాంచందర్, సురేందర్, కల్లెపల్లి కృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో అంగన్‌వాడీ టీచర్ మృతి



విజయనిర్మల (ఫైల్)

కాటారం, మార్చి 17: మండలంలోని ఐసీడీఎస్ గంగారం సెక్టార్ పరిధిలోని శంకరంపల్లి అంగన్ వాడీ టీచర్ విజయనిర్మల(40) ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో తుది శ్వాస విడిచారు. విజయనిర్మల మృతదేహానికి సీడీపీవో రాధిక, సూపర్‌వైజర్ వీణ, పలువురు అంగన్‌వాడీ టీచర్లు నివాళులర్పించారు.

ఇసుక లారీల పట్టివేత



కాటారం పోలీసులు పట్టుకున్న లారీలు

కాటారం. మార్చి 17: ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు కొరడా ఝుళిపించారు. కాటారం సీఐ నాగార్జునరావు నేతృత్వంలో కాటారం ఎస్సై అభినవ్ ఆదివారం తెల్లవారుజామున నాలుగు ఇసుక లారీలను పట్టుకున్నారు. మానేరు నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా లారీల్లో ఇసుకను హనుమకొండకు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు.

కొయ్యూర్ పరిధిలో..

మల్హర్ : మండలంలోని కొయ్యూర్‌లో అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక లారీలను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. పట్టుకున్న రెండు ఇసుక లారీలను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

సాహితి కుటుంబాన్ని పరామర్శించిన భద్రాచలం ఎమ్మెల్యే



సాహితి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావ్

వెంకటాపురం(నూగూరు), మార్చి 17: ఇటీవల హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్న మండలంలోని ఆలుబాకకు చెందిన సాహితి కుటుంబాన్ని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ ఆదివారం పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పిం చారు. సాహితి కుటుంబా నికి న్యాయం జరిగేలా చూస్తానని అన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంపా రాంబాబు, నాయకులు నల్లూరి నాని, పూజారి ఆదిలక్ష్మి తదితరులు ఉన్నారు.

న్యాయం చేయాలి : మహిళా మోర్చా

గోవిందరావుపేట: సాహితి కుటుంబానికి న్యాయం చేయాలని మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు చంద జ్యోతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో జరిగిన మహిళామోర్చా సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికార పార్టీ నేత కొడుకు వేధింపులతోనే సాహితి ఆత్మహత్య చేసుకుందని, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో అజ్మీరా లలిత, వీరమ్మ, స్వరూప పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

చిట్యాల, మార్చి 17: మండలంలోని చల్లగరిగ గ్రామంలో గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై షాఖాన్ తెలిపారు. ఆదివారం గ్రామంలో వాహన తనిఖీలు చేయగా ఓదెల మొగిళి వద్ద నుంచి ఎనిమిది లీటర్ల గుడుంబా లభ్యమైందని చెప్పారు. అతడిని విచారించగా బావుసింగ్‌పల్లి గ్రామానికి చెందిన అజ్మీర శ్రీనివాస్ నుంచి కొనుగోలు చేసినట్లు వెల్లడించాడన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బీజేపీ ములుగు మండల కమిటీ ఎన్నిక

ములుగు కలెక్టరేట్, మార్చి 17: భారతీయ జనతాపార్టీ ములుగు మండల నూతన కమిటీని ఆదివారం మండల అధ్యక్షుడు గాదం కుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా భైకని మహేందర్, కొత్తపల్లి విజేందర్, ఉపాధ్యక్షులుగా ఏరువ పాపిరెడ్డి, పేరబోయిన హేమాద్రి, యాద సంపత్, లింగంపల్లి రవీందర్‌రావు, గొంగళ్ల కట్టయ్య, కోశాధికారిగా యాట సాగర్, కార్యదర్శులుగా చంద్రగిరి భిక్షపతి, మచ్చిక రవి, శీలమంతుల రవీంద్రాచారి, ప్రచార కార్యదర్శులుగా నల్లాని జితేందర్‌రావు, మూల జగదీశ్, ఓబీసీమోర్చా అధ్యక్షుడిగా గుండెబోయిన శ్రీహరి, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా ఒద్దుల లక్ష్మి, కిసాన్‌మోర్చా అధ్యక్షుడిగా కొత్తకొండ రామన్న, దళితమోర్చా అధ్యక్షుడిగా మేకల రవి ఎన్నికయ్యారు.

మాజీ ఎంపీపీపై పోలీసులకు ఫిర్యాదు

కన్నాయిగూడెం, మార్చి 17: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్కపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న ఏటూరునాగారం మాజీ ఎంపీపీ జాడి రామరాజుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎం.డి.అఫ్సర్ పాషా ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీతక్కపై కొంత కాలంగా రామరాజు అసత్య ప్రచారాలు చేస్తున్నాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నామా కరంచంద్ గాంధీ, జాడి రాంబాబు, వైస్ ఎంపీపీ బొల్లె భాస్కర్, సుమన్, రాజబాబు పాల్గొన్నారు.

అపరిచితులకు ఆశ్రయం కల్పించొద్దు



గొత్తికోయనులనుద్దేంచి మాట్లాడుతున్న సీఐ శంకర్

గోవిందరావుపేట, మార్చి 17: గ్రామాల్లోకి వచ్చే అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దని పస్రా సీఐ శంకర్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్ర మంలో భాగంగా ఆదివారం మండలంలోని మచ్చాపూర్ గొత్తికోయ గూడాన్ని పోలీసులు సందర్శించారు. ఈసందర్భంగా సీఐ శంకర్ గొత్తికోయలను సమావేశపరిచి మా ట్లాడారు. మావోయిస్టులకు ఎలాంటి సహాయ సహకారాలు అందించకూడదని, గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సై కమలాకర్, సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ములుగు కలెక్టరేట్, మార్చి 17: తెలంగాణ రాష్ట్రంలోని కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కురుమసంఘం నాయకులు కంచు ప్రభాకర్, మేకల మహేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ములుగులో జరిగిన కురుమ సంఘం సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత కాలంలో కురుమలు గొర్రెలకాపరులు, గొంగడినేతలు, ఒగ్గు కళాకారులుగా జీవనం గడుపుతున్నారని, విద్య, ఆర్థిక, రాజకీయరంగాల్లో పూర్తిగా వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈసమావేశంలో నాయకులు ఎలుకపల్లి శ్రీనివాస్, మల్లయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రామప్ప జర్నలిస్టు సొసైటీ కార్యవర్గం ఏర్పాటు

వెంకటాపూర్(రామప్ప), మార్చి 17: రామప్ప జర్నలిస్టు సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా రామిడి కృష్ణారెడ్డి, అధ్యక్షుడిగా బేతి సతీష్, ప్రధాన కార్యదర్శిగా పిల్లలమర్రి శివ, కోశాధికారిగా నూనె నరేష్, ఉపాధ్యక్షులుగా కేతిరి భిక్షపతి, ఒద్దుల మురళి, ముఖ్య సలహాదారుడిగా దేశిని మహేందర్, సభ్యులుగా గుణగంటి హరీశ్, దండేపల్లి సారంగం, మామిడిశెట్టి ధర్మతేజ, గోరంట్ల విజయ్‌కుమార్, ఎమ్డీ.రఫీ, ఆలుగొండ రమేష్, పిల్లలమర్రి రాము, గట్టు ప్రశాంత్ ఎన్నికయ్యారు.

ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల అధ్యక్షుల ఎన్నిక

వెంకటాపురం(నూగూరు), మార్చి 17: మండలంలోని ఎస్సీమర్రిగూడెం గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మహాజన సోషలిస్టుపార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంఎస్పీ ములుగు జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు, అధికార ప్రతినిధి గజ్జల ప్రసాద్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా తోకల శివ, మహాజన సోషలిస్టు పార్టీ మండల అధ్యక్షుడిగా యాసం మహేష్, అధికార ప్రతినిధి వేల్పుల మనోజ్‌లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నాయకులు గుగ్గిళ్ల నరేంద్ర, గజ్జల ప్రశాంత్, శంకర్, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.